నేడు ఖమ్మంలో టీఆర్ఆర్ ఆర్థో, యాక్సిడెంట్ కేర్ యూనిట్ ప్రారంభం

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తోట లక్ష్మణ్‌కుమార్

ఖమ్మం సిటీ, నవంబర్ 17 : ఖమ్మ నగరంలోని వైరారోడ్‌లో ఉన్న పాత ఆరోగ్య భవనంలో టీఆర్ఆర్ ఆర్థో, యాక్సిడెంట్ కేర్ యూనిట్ ఆసుపత్రిని సోమవారం ప్రారంభిస్తున్నామని డాక్టర్ తోట లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఖమ్మం 48వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి సంబంధించి రింగ్ రీ కనస్ట్రక్టివ్ సర్జరీలో తనకు ప్రావీణ్యం ఉందన్నారు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నాలుగు వేలకు పైగా సర్జరీలను విజయవంతంగా పూర్తిచేసిన అనుభవం తన సొంతం అన్నారు. వైద్య రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించిన తర్వాతనే ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నానని వెల్లడించారు. ఉమ్మడి జిల్లాతోపాటు మహబూబాబాద్, సూర్యాపేట, కృష్ణా తదితర జిల్లాల ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలు అందిస్తానని ఆయన స్పష్టం చేశారు. సోమవారం టీఆర్ఆర్ ఆర్థో, యాక్సిడెంట్ కేర్ యూనిట్‌ను రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రాజ్యసభ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం ఎంపీ రామసాయం రఘురామరెడ్డి, ఎంపీ రేణుకాచౌదరి, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, జిల్లాలోని ఇతర ఎమ్మెల్యేలు కలిసి ప్రారంభిస్తారని చెప్పారు. తాను అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో 48వ డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ, 51వ డివిజన్ కార్పొరేటర్ శీలంశెట్టి రమ, బీఆర్ఎస్ నేతలు తోట రామారావు, శీలంశెట్టి వీరభద్రం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఉద్యమాలు నిర్వహిస్తాం

మాట్లాడుతున్న మిడియం బాబురావు

టేకులపల్లి, నవంబర్ 17: కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందని, ప్రభుత్వ తీరుపై ఉద్యమాలు చేపడుతామని మాజీ ఎంపీ మిడియం బాబు రావు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేశ్ అన్నారు. ఆదివారం టేకులపల్లిలోని సీపీఎం కార్యాలయం (బొట్టు పాపయ్యనగర్)లో సీపీఎం మండల మహాసభ నిర్వహించారు. తొలుత బోడు రోడ్ సెంటర్లో పార్టీ జెండాను బాబురావు ఆవిష్కరించారు. అనంతరం ప్రదర్శనగా సీపీఎం కార్యాలయానికి చేరుకుని అమరవీరులకు పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం బాబురావు మాట్లాడుతూ భూములపై ఉన్న సకల సమస్యలు పరిష్కరించబడాలంటే ఎర్రజెండా సిద్ధాంతం ఒక్కటే మార్గమని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రేపాకుల శ్రీనివాసరావు, భూక్యా రమేశ్, ఈసం నర్సింహారావు, కడుదుల వీరన్న, పూనెం స్వామి, పూనెం చంద్రశేఖర్, దొడ్డ సంపత్, పాయం వెంకన్న, జోగ రాంబాబు, దశరథ్, పూనెం రాంబాబు, సావిత్రి, చుక్కమ్మ, కిషోర్ పాల్గొన్నారు.

కార్తీక మాస వన భోజనాలు

మున్సిపల్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

ఇల్లెందు రూరల్, నవంబర్ 17: మండలంలోని రోంపేడు సైదులు మామిడి తోటలో ఆదివారం ఆర్యవైశ్యుల వనసమారాధన జరిగింది. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, తోటి సహచరుల కోసం ఒక్కరోజు సమయం తీసి వారితో గడిపితే బంధాలు చెక్కుచెదరకుండా శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. అనంతరం చిన్నారులు, యువతులు చేసిన సందడి అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంఘ నాయకులు అర్వపల్లి రాధాకృష్ణ, అనుబాబు, పుల్లూరి సతీశ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ, నవంబర్ 17: స్థానిక ఆడమ్స్ ఇంజినీరింగ్ కాలేజీలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాసం వన భోజనాలు జరిగాయి. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, నాయకులు ఎడవల్లి కృష్ణ, వనమా రాఘవ, రంగా కిరణ్, కొత్వాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట రూరల్..

దమ్మపేట రూరల్, నవంబర్ 17: మండల పద్మనాయక వెలమ వన సమారాధన ఆదివారం దమ్మపేట శివారులోని పామాయిల్ తోటలో జరిగింది. నాయకులు రావు జోగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేటలో..

దమ్మపేట, నవంబర్ 17: స్థానిక పామాయిల్ తోటలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన జరిగింది. బాధ్యులు శ్రీరాముల నర్సింహాచారి, దాసరోజు రామారావు, శ్రీపాద రామానుజాచారి తదిరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బూర్గంపహాడ్, నవంబర్ 17: సారపాక విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే ఇరవెండి 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 7:00 నుంచి 10:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ గుర్రం ఉపేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

సీపీఎం మండల కమిటీ ఎన్నిక

దమ్మపేట రూరల్, నవంబర్ 17: సీపీఎం మండల కమిటీని మొద్దులగూడెంలో జరిగిన ఆ పార్టీ మహాసభ ఎన్నుకుంది. కార్యదర్శిగా మోరంపూడి శ్రీనివాసరావు, 12 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నాయకులు పుల్లయ్య అర్జున్, దొడ్డా లక్ష్మీనారాయణ, పిల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్దికొండ - నారంవారిగూడెం

బీటీ రోడ్డు పనుల్లో నాణ్యత డొల్ల

రోడ్డు నిర్మాణానికి గ్రావెల్‌కు బదులు వినియోగిస్తున్న జోగురు రాయి, ప్రభుత్వ భూమిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

గ్రావెల్‌కు బదులు జోగురు రాళ్లు తరలింపు
ప్రభుత్వ భూమిలో అక్రమ తవ్వకాలు

అశ్వారావుపేట, నవంబర్ 17 : మండలంలోని మద్దికొండ నుంచి నారంవారిగూడెం క్రాస్‌రోడ్డు వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనుల్లో అధికారుల ఉదాసీనత కాంట్రాక్టర్లకు కాసుల వర్షం కురిపిస్తున్నది. వివరాల్లోకెళ్తే... బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.76 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను మొదలుపెట్టారు. అయితే సదరు కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణంలో గ్రావెల్‌కు బదులు సమీపంలోని జోగురు రాళ్ళను వినియోగిస్తున్నారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. రోడ్డు స్వల్పకాలంలోనే ధ్వంసమవుతుందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీసం నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరేలా అధికారులు పరోక్ష సహకారం అందిస్తున్నారనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. మట్టి పనులు జరుగుతుండగానే రహదారి బురదమయం అవుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ తవ్వకాలు..

రోడ్డు నిర్మాణానికి అవసరమైన గ్రావెల్(జోగురు రాళ్ళు) తవ్వకాలను సదరు కాంట్రాక్టర్ ప్రభుత్వ భూమిలోనే యధేచ్ఛగా సాగిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా రూ.లక్షలు విలువైన సంపదను తరలించుకుపోతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ గుమస్తా అక్రమ రవాణాను అడ్డుకోగా పనులు పర్యవేక్షిస్తున్న ఒక వ్యక్తి ఫోన్లో ఎవరితోనే మాట్లాడించారు. తహసీల్దార్ మాట్లాడుతున్నారంటూ గుమస్తాకు ఫోన్ ఇచ్చారు. అటువైపు ఎవరు మాట్లాడారో గానీ నేను తహసీల్దార్‌ను మాట్లాడుతున్నాను. రెండురోజుల్లో పనులు పూర్తి అవుతాయి. గ్రావెల్ తవ్వకాలకు తానే అనుమతినిచ్చానంటూ ఆదేశించారు. దీంతో గుమస్తా మిన్నకుండిపోయాడు. ఈ విషయమై తహసీల్దార్ పి.కృష్ణప్రసాద్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా రోడ్డు నిర్మాణానికి అవసరమైన గ్రావెల్ తవ్వకాలకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదని చెప్పారు. ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ దృష్టికి గ్రావెల్, రోడ్డ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాన్ని తీసుకెళ్ళగా పరిశీలించి నాణ్యత లేకున్నా పెద్దరాళ్ళను వినియోగిస్తున్నా పనులను నిలిపివేస్తామని బదులిచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతున్నట్లు కాంట్రాక్టర్ మనుషులు వచ్చి ఫోన్ ఇచ్చారని పంచాయతీ గుమస్తా సీతారాములు తెలిపారు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్ళానని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి సమ్మయ్యను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

అశ్వారావుపేట, నవంబర్ 17: కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలన్న డిమాండుతో పీవైఎల్ ఉద్యమం చేపట్టింది. దీని ప్రచార వాల్ పోస్టర్‌ను రాష్ట్ర కోశాధికారి వాసం బుచ్చిరాజు, మండల కార్యదర్శి కుంజా అర్జున్ ఆదివారం మండలంలోని దురదపాడు గ్రామంలో ఆవిష్కరించారు. నాయకులు కంగాల వెంకటేష్, కొమరం లక్ష్మణరావు, కుంజా లక్ష్మి, కొడిమి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శివకల్యాణం

నూతన కల్యాణమండపం ఏర్పాటు

కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, నవంబర్ 17: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి అనుబంధ శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం(శివాలయం)లో ఆదివారం ఉదయం శ్రీఅన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు అయ్యూరి సుబ్రమణ్యేశ్వర శర్మ, వేదపండితులు లింగాల రామకృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, యజ్ఞోపవీతధారణ, జిలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలతో పాటు వేదాశీర్వచనంతో కల్యాణ కార్యక్రమం ముగిసింది. దాతలు యాలం బాబ్జి, సత్యకుమారి, యాలం అప్పారావుల సహకారంతో రూ.6లక్షలతో అనుబంధ ఆలయం శివాలయంలో నూతనంగా కల్యాణ మండపం నిర్మించారు. కల్యాణానికి సంబంధించి పట్టువస్త్రాలు శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం తరపున ఆలయ ఈవో రమాదేవి స్వామివారికి సమర్పించి కల్యాణమండపాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఈఈ వీ రవీంద్రనాథ్, ఆలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పంప్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్

ఇల్లెందు రూరల్, నవంబర్ 17: సింగరేణిలో పంప్ ఆపరేటర్ క్యాటగిరి -3 పోస్టుల భర్తీకి ఆదివారం ఎస్‌వోటూజీఎం కార్యాలయంలో ఎస్‌వోటూజీఎం బొల్లం వెంకటేశ్వర్లు , కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌వోటూజీఎం మాట్లాడుతూ పంప్ ఆపరేటర్ పోస్టుల కోసం నోటిఫికేషన్ విడుదల చేసి అర్హత ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఏజీఎం గిరిధర్‌రావు, డీజీఎం పర్సనల్ జీవీ మోమన్‌రావు, డీజీఎం సివిల్ రవికుమార్, మౌనిక పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఇల్లెందు రూరల్, నవంబర్ 17 ః పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఆసుపత్రి సిబ్బందిపై ఉందని సింగరేణి సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ పీ సుజాత అన్నారు. ఆదివారం ఇల్లెందు ఏరియా ఆసుపత్రిని ఆమె సందర్శించారు. రోజువారి ఓపీ వివరాలు, అత్యవసర విభాగం, ఇన్‌పేషెంట్, రిఫరీ కేసులు తదితర వాటిని ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదపూర్వకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ నర్సింహారావు, క్లర్క్ అరుణ, సిస్టర్స్ గ్రేస్, సౌభాగ్యవేణి, వార్డు బాయి సలీం పాల్గొన్నారు.

సమసమాజ స్థాపన కోసం కృషి చేయాలి

ఇల్లెందు రూరల్, నవంబర్ 17: సమసమాజ స్థాపన నిర్మాణం కోసం సీపీఎం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం నాయకుడు అబ్దుల్ నబి అన్నారు. ఆదివారం మండలంలోని సుందరయ్యనగర్‌లో జరిగిన సీపీఎం నాయకుడు లక్ష్మణ్‌సింగ్ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 20, 21 తేదీల్లో సీపీఎం జిల్లా తృతీయ మహాసభలు ఇల్లెందులో జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆలేటి కిరణ్‌కుమార్, తాళ్ళూరి కృష్ణ, జైబున్నిసా పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు

పాల్వంచ రూరల్, నవంబర్ 17: మండలంలోని పెద్దమ్మ తల్లి గుడికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. శివలింగానికి అర్చకులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు.

పాలాలకు దారి ఇవ్వాలని దీక్ష

చంద్రుగొండ, నవంబర్ 17: తమ పంట పొలాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలన్న డిమాండుతో ఆదివాసీ రైతులు రాస్తారోకోకు దిగారు. మండలంలోని మద్దుకూరు గ్రామానికి ఆదివాసీ గిరిజన రైతులు 120 మందికి 2004లో నాటి ప్రభుత్వం 150 ఎకరాలకు జంగు పట్టాలు ఇచ్చింది. వారు ఆ భూములను అప్పటి నుంచి సాగు చేసుకుంటున్నారు. ఆ రైతులు తమ భూముల్లోకి వెళ్లకుండా కొద్ది రోజుల నుంచి గిరిజనేతర రైతులు అడ్డుకుంటున్నారు. దీనిని నిరసిస్తూ గిరిజన రైతులు ఆదివారం గ్రామంలోని ప్రధాన రహదారిపై అడ్డంగా ముళ్ల కంచె వేసి, అక్కడే దీక్ష చేపట్టారు.

లారీల రాకపోలను వ్యతిరేకిస్తూ ఆందోళన

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 17: తమ నివాస ప్రాంతం మీదుగా లారీల వంటి భారీ వాహనాల రాకపోకలను వ్యతిరేకిస్తూ పాత కొత్తగూడెం వాసులు ఆదివారం ఆందోళనకు దిగారు. లారీలు, టిప్పర్లు తదితర భారీ వాహనాల రాకపోకలతో తమ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయని భయాందోళన వ్యక్తం చేశారు. పాత కొత్తగూడెం-పెనుబల్లి రోడ్డును ఆదివారం మూసివేసి అక్కడే బైఠాయించారు.

రెండో రోజూ ధర్నా చేపట్టిన బాధితులు

టేకులపల్లి, నవంబర్ 17: కోయగూడెం ఓసీకి నిత్యం వెళ్లే లారీలు దుమ్ము దూళి వెదజల్లుతున్నాయని, దీంతో అనారోగ్యం బారిన పడుతున్నామని తమను పట్టించుకునేవారు లేరని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని దాస్‌తండా-రేగులతండాల గిరిజనులు ఆదివారం రోడ్డుకు అడ్డుగా కూర్చోని ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న సింగరేణి అధికారులు, పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పి పనులు త్వరలో పూర్తి చెప్పడంతో ఆందోళనను విరమించారు.

బీసీ రిజర్వేషన్లు కల్పించాలని వినతి

బూర్గంపహాడ్, నవంబర్ 17: బీసీ రిజర్వేషన్లు కల్పించాలని జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో బీసీ డెడికేషన్ చైర్మన్‌కు బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మహంకాళి రామారావు ఆదివారం వినతిపత్రం అందజేశారు. దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, నవంబర్ 17: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణపుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. అంతరాలయంలోని ధ్రువమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణమూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

భద్రాద్రి రామయ్యకు బంగారుహారం వితరణ

బంగారు హారాన్ని ఆలయ అధికారులకు అందజేస్తున్న దాతలు

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారికి పట్టణానికి చెందిన కొంజర్ల సుబ్రహ్మణ్యం, కృష్ణకుమారి దంపతులు రూ.4లక్షలతో తయారు చేయించిన 63 గ్రాముల బంగారుహారాన్ని ఆలయ అధికారులకు ఆదివారం అందజేశారు. తొలుత వారు స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం దంపతులను అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

వాడవాడలా అయ్యప్ప పడిపూజలు

పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

పర్ణశాల, నవంబర్ 17: దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల, సీతానగరం, బంధ్రేవు, నల్లబెల్లి, లక్ష్మీనగరం, సీతారాంపురం, నర్సాపురం, తూరుబాక, దుమ్ముగూడెం గ్రామాల్లోని యువకులు, పెద్దలు అయ్యప్ప, భవాని, శివ, బాబా మాలలు స్వీకరించారు. 41 రోజులు మండల పూజా కార్యక్రమాలు నిర్వహించి తమ భక్తిని చాటుకుంటున్నారు. ప్రతీ గ్రామంలో మాలుల ధరించే వారి సంఖ్య ప్రతీ ఏడు పెరుగుతూ ఉంది. కార్తీక మాసం రాగానే గురు స్వాములు అయ్యప్ప మాలలు స్వీకరించి వారితో పాటు మరికొందరికి అయ్యప్ప మాలలు ధరింపజేసి 41 రోజులు మండల దీక్ష చేపడుతున్నారు. గ్రామాల్లో అయ్యప్ప భక్తులతో కలిసి అయ్యప్ప పీఠాలు ఏర్పాటు చేసుకుంటారు. మండలానికి చెందిన గురు స్వాములు జీరి సత్యనారాయణ స్వామి, వేముల శ్రీనివాస స్వామి, గోసుల వెంకటేశ్వర స్వామి, పంపన పవన్ స్వామి, భాస్కర్ స్వామిల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మండల దీక్షలు చేపట్టి ఎంతో ఘనంగా పడిపూజ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో చేపడుతున్నారు.

నేడు 'ప్రజావాణి' రద్దు

కొత్తగూడెం టౌన్, నవంబర్ 17: కుల గణన సర్వే, గ్రూప్-3 పరీక్షల నిర్వహణలో జిల్లా అధికారులు నిమగ్నమైనందున సోమవారం 'ప్రజావాణి'ని రద్దు చేసినట్లు అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని ప్రజలంతా గమనించాలని, ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

నేటి నుంచి సైన్స్ ఫెయిర్

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 17: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర వసతి గృహంలో సోమవారం జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్) ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం పరిశీలించారు.

వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేట, నవంబర్ 17: అనారోగ్య కారణాలతో ఆసుపత్రికి వెళ్లిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... మండలంలోని వినాయకపురం గ్రామస్తుడు గుల్లా సద్గుణరావు(36) బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తల నొప్పిగా ఉండడంతో శనివారం చికిత్స కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు ఆసుపత్రికి వెళ్లాడు. అతడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా అక్కడి రైల్వే పోలీసుల నుంచి తండ్రి దుర్గయ్యకు ఫోన్‌లో ఆదివారం సమాచారం అందింది. తండ్రి, కుటుంబీకులు వెంటనే ఏలూరు వెళ్లారు. సద్గుణరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏలూరు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

ఇల్లెందు రూరల్, నవంబర్ 17: కుటుంబకలహాలతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఎండీ అప్జల్ (22)కు 5 నెలల క్రితం వివాహమైంది. కాగా కొద్ది కాలంగా భార్యతో తరుచూ విబేధాలు వస్తున్నాయని, భార్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్జల్‌పై ఫిర్యాదు చేసింది. ఇది తెలిసిన అప్జల్ కొద్ది రోజుల క్రితం అవమానకరంగా భావించి పురుగుల మందు తాగాడు. వరంగల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన జర్నలిస్టులు

భద్రాచలం, నవంబర్ 17: భద్రాచలం గోదావరి వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఒక వ్యక్తిని జర్నలిస్టులు కాపాడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బూర్గంపహాడ్ మండలానికి చెందిన జర్నలిస్టులు అబ్దుల్ ఘని, జాకీర్ భద్రాచలం వస్తుండగా ఓ యువకుడు వంతెనపై కూర్చుని గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేస్తుండడం చూశారు. అతన్ని చాలాసేపు వారించడానికి చూసినా వినకుండా దగ్గరకు వస్తే దూకేస్తా అని బెదిరించాడు. అటుగా ద్విచక్రవాహనంపై వస్తున్న మరో వ్యక్తి వాహనాన్ని ఆపి వెనుక నుంచి వంతెనపై ఉన్న వ్యక్తిని పట్టుకుని కిందకు లాగడంతో ప్రమాదం తప్పింది. ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు.

23న మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 17: నల్గొండలో ఈ నెల 23న మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ మదుసూధన్‌రావు చెప్పారు. ఈ కార్యక్రమ ప్రచార వాల్ పోస్టర్‌ను కొత్తగూడెంలోని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో కన్వీనర్ తాళ్లపల్లి రవి ఆధ్వర్యంలో నల్గొండ సాగర్ రోడ్‌లోని జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఈ ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని చెప్పారు. నాయకులు కూరపాటి రవీందర్, మెరుగు అనసూర్య, శనగ ప్రభాకర్, గాదం రాజేందర్, పోచంపల్లి సురేష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బోర్డ్ మెంబర్‌గా శ్రీనివాస్‌రెడ్డి

కొత్తగూడెం టౌన్, నవంబర్ 17: రైల్వే బోర్డ్ మెంబర్‌గా మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకుడు వై.శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. కొత్తగూడెం కేంద్రంగా కొవ్వూరు రైల్వే జంక్షన్‌కు కృషి చేస్తానని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

చీకటిమయంగా 'పాత వంతెన'

- గోదావరి బ్రిడ్జిపై మూడు రోజులుగా వెలగని విద్యుత్ దీపాలు
- కొత్తగా నిర్మించిన వంతెనకు అసలు విద్యుత్ దీపాలే లేవు
- భయం భయంగా వంతెనపై వాహనదారుల ప్రయాణం